సాక్షి
ఖమ్మం
శుక్రవారం : 23 : జూన్ : 2023



...ఇన్ని నిబంధనలా?!

పల్లెవెలుగు బస్సుల్లో రాయితీ కోసం టీ–9 టికెట్ ప్రవేశపెట్టినా నిబంధనలతో పెద్దగా లాభం జరగడం లేదు. 10లో



దగా పడ్డ తెలంగాణలో వేడుకలా?

ప్రజలను మోసగించిన బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ది వేడుకలు నిర్వహించడం గర్హనీయమని మాజీ ఎంపీ వీహెచ్ అన్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
32° / 26°

జిల్లాలో శుక్రవారం వాతావరణం చల్లబడుతుంది. పలు ప్రాంతాల్లో చిరు జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాల పనుల్లో వేగం పెంచండి



మెడికల్ కళాశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం వైద్యవిభాగం: ఇప్పటికే అనుమతులు రావడంతో పాటు ప్రవేశాలకు సమయం సమీపిస్తున్న నేపథ్యాన ప్రభుత్వ వైద్యకళాశాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. పాత కలెక్టరేట్‌లో ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటుకు జరుగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఫిజియాలజీ, హేమటాలజీ ల్యాబ్‌లు, బయో కెమిస్ట్రీ, మ్యూజియం, లెక్చర్ హాల్, పరిపాలన కార్యాలయం తదితరాలను పరిశీలించి సూచనలు చేశారు. పనులన్నీ ఈ నెలాఖరులోగా పూర్తవుతాయని అధికారులు చెప్పగా, అనుకున్న సమయానికి పూర్తయ్యేలా వనరులు సమకూర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట వైద్యాధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు ఉన్నారు.

మధిరలో ఆర్‌యూబీ నిర్మాణానికి ఓకే..

- ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: మధిరలో రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ) నిర్మాణానికి రైల్వేశాఖ కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు తెలిపారు. మధిరలో రైల్వే గేట్ మూసే సమయంలో వాహనదారులు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఆర్‌యూబీ నిర్మించాలని కోరుతూ ఎంపీ నామ పలుమార్లు కేంద్ర మంత్రికి లేఖలు రాయడమే కాక నేరుగానూ విన్నవించారు. మధిరలో 35వేలకు మించి జనాభా ఉండడమే కాక ఏపీకి సరిహద్దుగా ఉన్న నేపథ్యాన ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ఆర్‌యూబీ అవసరమని వివరించడంతో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ లేఖ పంపించారని ఎంపీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ప్రారంభం

ఖమ్మంలీగల్: జిల్లా కోర్టులో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్‌ను శుక్రవారం ప్రారంభిస్తున్నట్లు జిల్లా జడ్జి బీఎస్.జగ్జీవన్‌కుమార్ తెలిపారు. హైకోర్టు చీఫ్ జస్టిస్, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిలు వర్చువల్ పద్ధతిలో ఈ విధానాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈమేరకు న్యాయసేవా సదన్‌లో జరిగే కార్యక్రమానికి న్యాయవాదులు హాజరుకావాలని సూచించారు.

అమరవీరుల స్థూపం వద్ద జిల్లా నేతలు



అమరవీరుల స్థూపం వద్ద ఎంపీలు, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు రవిచంద్ర, కవిత, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాత మధుసూదన్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డీసీసీబీ మహాజన సభ

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) 123వ మహాజన సభ శుక్రవారం జరగనుంది. చైర్మన్ కూరాకుల నాగభూషణం అధ్యక్షతన ఖమ్మంలోని ఎస్ పార్క్ హోటల్‌లో ఉదయం 11 గంటలకు మొదలవుతుందని సీఈఓ అట్లూరి వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాజన సభలో 2022–23 ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదిక ఆమోదం, లాభనష్టాల సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, వ్యవసాయేతర సహకార సంఘాల అధ్యక్షులు సభకు హాజరుకావాలని సీఈఓ సూచించారు.

మొదలు పెట్టేశారు!

అనుమతి లేకుండా పత్తి విత్తనాల అమ్మకం

- వర్షపు జల్లులతో సాగు పనులు ఆరంభించిన రైతులు
- డిమాండ్‌ను ఆసరా చేసుకుని రంగంలోకి దిగిన దళారులు
- జిల్లాలోని పలు గ్రామాల్లో జోరుగా బ్లాక్ దందా



మధిర సమీపాన పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: వానాకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో దళారులు విత్తన దందాకు తెరలేపారు. సింగిల్ పికింగ్ పత్తి విత్తనాల పేరుతో రైతులకు మాయమాటలు చెప్పి అధిక ధరకు అంటగడుతున్నారు. ప్రస్తుతం అక్కడక్కడా వర్షాలు కురుస్తుండటంతో పత్తి విత్తనాలను నాటేందుకు రైతాంగం సిద్ధమైంది. ఈ క్రమంలో డీలర్ల నుంచి విత్తన ప్యాకెట్లు భారీగా కొనుగోలు చేస్తున్న దళారులు గ్రామాల్లో ఇష్టమొచ్చిన ధరకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, నకిలీ విత్తనాలపైనే దృష్టి సారిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు.. బ్లాక్ దందాపై కూడా ఓ కన్నేయాల్సిన అవసరాన్ని ఈ ఘటనలు తెలియజేస్తున్నాయి. అలాగే, వ్యవసాయ శాఖ కూడా రైతులు దళారుల చేతిలో మోసపోకుండా అవగాహన కల్పించాల్సి ఉంది.

విత్తనాలు పుష్కలంగా ఉన్నా...

ఈ సీజన్‌లో జిల్లాలో 6.50 లక్షల ఎకరాల్లో అన్ని పంటలు కలిపి సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో వరి 2,89,983 ఎకరాలు, పత్తి 2,23,617 ఎకరాలు, మిర్చి 80 వేల ఎకరాల వరకు ఉంటాయనేది అంచనా. ఇప్పుడిప్పుడే సీజన్ ప్రారంభమవుతుండడంతో పత్తి విత్తేందుకు అనువైన సమయంగా భావించిన రైతులు కొన్ని ప్రాంతాల్లో విత్తారు. ఒక ఎకరానికి రెండు ప్యాకెట్ల విత్తనాలు సరిపోయినా మరో ప్యాకెట్ అదనంగా కొనుగోలు చేస్తారు. ఈ అంచనాతో వ్యవసాయ శాఖ జిల్లాలో 5.50 లక్షల విత్తన ప్యాకెట్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లాలోని 608 మంది డీలర్ల వద్ద విత్తనాలు సిద్ధంగా ఉండగా.. కంపెనీలు, బరువు ఆధారంగా ప్యాకెట్ ధర రూ.830నుంచి రూ.850 వరకు పలుకుతోంది.



రంగంలోకి దళారులు

ఇంకా వ్యవసాయ సీజన్ పూర్తిగా ప్రారంభం కాక ముందే దళారులు పత్తి విత్తన దందా మొదలుపెట్టారు. రైతుల అమాయకత్వమే పెట్టుబడిగా మార్చుకున్న పలువురు డీలర్ల నుంచి భారీ మొత్తంలో విత్తన ప్యాకెట్లు కొనుగోలు చేసి గ్రామాల్లో విక్రయాలు చేపడుతున్నారు. ప్రస్తుతం సింగిల్ పికింగ్ విత్తనాలకు జిల్లాలో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో దళారులు వీటి పేరు చెప్పి రైతులకు అంటగడుతున్నారు. డీలర్ల వద్ద 450 గ్రాముల విత్తన ప్యాకెట్‌ను రూ.850కి కొనుగోలు చేసి.. గ్రామాల్లో రూ.1,250 నుంచి రూ.1,300 వరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. నాణ్యమైన విత్తనాలని, ఎక్కడా దొరకవని చెబుతుండడంతో రైతులు కూడా నమ్ముతున్నారు. మరోవైపు ఓ కంపెనీకి చెందిన 7069 రకం పత్తి విత్తనాలకు డిమాండ్ ఉండడంతో స్థానికంగా లభ్యం కాకపోతే రైతులు గుంటూరు వంటి ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇది దళారులకు కలిసొస్తోంది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు విత్తన దుకాణాలపై తనిఖీలు చేపడుతున్నా.. దళారులు ఎక్కువ ప్యాకెట్లు కొనుగోలు చేసుకుని ఇంటి వద్దే రైతులకు అధిక ధరకు విక్రయిస్తుండడం గమనార్హం.

నిబంధనలు బేఖాతర్

జిల్లాలో లైసెన్స్ కలిగిన డీలర్లు 608 మంది ఉన్నారు. వీరు విత్తనాలు అమ్మే సమయంలో అన్ని వివరాలను నమోదు చేయాలి. ఐదు నుంచి పది ఎకరాల వరకు నాటేందుకు పది నుంచి ఇరవై ప్యాకెట్లు అవసరమవుతాయి. ఇంతకంటే కావాలని ఎవరైనా అడిగితే భూమి పాస్ పుస్తకం, కౌలుదారుడైతే కౌలుకు ఇచ్చిన రైతు పాస్ పుస్తకం తీసుకున్నాకే విక్రయించాలి. కానీ డీలర్లు ఇవేమీ పట్టించుకోకుండా భారీ మొత్తంలో విత్తన ప్యాకెట్లు అమ్ముతున్నారు. ఇటీవల ఖమ్మం సుందర్ టాకీస్ రోడ్డులోని ఓ దుకాణ యజమాని నిబంధనలు ఉల్లంఘించి రూ.25.59 లక్షల విలువైన ఓ కంపెనీ పత్తి విత్తనాలను బెంగళూరుకు తరలించాడు. టాస్క్‌ఫోర్స్ దాడుల్లో ఈ విషయం వెలుగు చూసింది. అలాగే కొణిజర్లలోనూ అనుమతి లేకుండా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకుంది. సీజన్ మొదలుకాక ముందే రెండు కేసులు నమోదైన దృష్ట్యా.. పట్టుబడని దళారులు ఇంకా ఉండే అవకాశమున్నందున అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రైతాంగం కోరుతోంది.

అధిక ధరలకు విక్రయిస్తూ..

కొణిజర్లకు చెందిన కె.సుధాకర్ కామేపల్లి మండలం ముచ్చర్లలోని ఓ ఫెర్టిలైజర్ షాపు నుంచి 250 వరకు పత్తి విత్తన ప్యాకెట్లను రూ.850 చొప్పున కొనుగోలు చేశాడు. వీటిని కొణిజర్లలోని తన ఇంటి వద్ద రూ.1,250 నుంచి రూ.1,300 చొప్పున రైతులకు ఎలాంటి బిల్లులు లేకుండా విక్రయిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీ చేపట్టగా విషయం బయటపడింది. ఈసందర్భంగా సుధాకర్ తాను 250 ప్యాకెట్లు కొనుగోలు చేశానని చెప్పగా.. 179 ప్యాకెట్లకు రైతుల పేరుతో బిల్లులు లభించాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఇలా దళారులు డిమాండ్ ఉన్న సింగిల్ పికింగ్ విత్తనాలను రైతులకు అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో దళారులపై దృష్టి సారించడమే కాక డీలర్లను కట్టడి చేయాల్సి ఉందని చెప్పొచ్చు.



అనుమతి లేకుండా విక్రయిస్తున్న పత్తి విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

‘భద్రాద్రి’కి నమస్కారం!

నా తరఫున చెప్పండి

- ‘నైటింగేల్’ సుశీలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- అవార్డు స్వీకరించిన ఏఎన్ఎం



గొత్తికోయ చిన్నారిని పరీక్షిస్తున్న సుశీల (ఫైల్)



భర్త, పిల్లలతో ఏఎన్ఎం సుశీల

అన్నపురెడ్డిపల్లి: ‘నా తరఫున మీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు నమస్కారం చెప్పండి’ అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారని ప్రతిష్టాత్మక ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు గ్రహీత తేజావత్ సుశీల తెలిపారు. 2022 – 23 ఏడాదికి గాను జాతీయ స్థాయిలో నర్సులు/ఏఎన్ఎంలకు అందించే ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న ఆమె ఎంపికయ్యారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సుశీల అవార్డు అందుకున్నారు. అవార్డు ప్రదానం ముగిసిన తర్వాత జరిగిన ఫొటో సెషన్‌లో రాష్ట్రపతితో రెండు నిమిషాల సేపు మాట్లాడే అవకాశం ఆమెకు దక్కింది. ఈ సందర్భంగా ముందుగా సుశీలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుభాకాంక్షలు తెలిపారు. ‘చాలా బాగా పని చేశారు.. మున్ముందు కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి’ అని సూచించారు. రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపిన సుశీల.. తాను గిరిజన జనాభా ఎక్కువగా ఉండే తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి వచ్చానని చెప్పారు. గత డిసెంబర్‌లో జిల్లాకు రాష్ట్రపతి వచ్చిన విషయంతో పాటు తమ ప్రాంత గిరిజనులతో ప్రత్యేకంగా మాట్లాడారని గుర్తు చేశారు. తమ జిల్లాలోని గిరిజన గ్రామాలను ఇప్పటికే గవర్నర్ తమిళిసై దత్తత తీసుకున్నారని చెప్పారు. దీనికి ద్రౌపది ముర్ము స్పందిస్తూ... ‘నా తరఫున మీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు మీరు నమస్కారం తెలియజేయండి’ అని అన్నారు.

27 ఏళ్ల సర్వీస్

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన సుశీల 1996లో ఏఎన్ఎంగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 1996 నుంచి 2008 వరకు మణుగూరులో పని చేశారు. ఆ తర్వాత 2008 నుంచి 2010 వరకు సుజాతనగర్ పీహెచ్‌సీలో సేవలు అందించారు. 2010లో అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి పీహెచ్‌సీ పరిధిలోని మద్దుకూరు సబ్ సెంటర్‌లో పనిచేస్తూ మద్దుకూరు, సీతాయిగూడెం, దామరచర్ల, మంగళబోడు గ్రామాల పరిధిలోని ప్రజలకు ఏఎన్ఎంగా వైద్య సేవలు అందిస్తున్నారు.

అందరికంటే మిన్నగా

గత ఇరవై ఏడేళ్లుగా గిరిజన ప్రాంతంలో వైద్య సేవలు అందిస్తున్న సుశీల జాతీయ స్థాయి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్రం నుంచి మొత్తం మూడు ఎంట్రీలు వెళ్లగా గిరిజన ప్రాంతాల్లో ముఖ్యంగా వలస గొత్తికోయ గ్రామాల్లో సుశీల అందించిన సేవలు ఆమెను ప్రత్యేకంగా నిలిపాయి. దీంతో ప్రతిష్టాత్మక అవార్డు ఆమె సొంతమైంది. సుశీలను జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఒత్తిడిని జయించాలి

ఉద్యోగాలు చేసే మహిళలు ఓ వైపు కుటుంబం నుంచి వచ్చే ఒత్తిడిని, మరోవైపు వృత్తిపరమైన ఒత్తిడిని బ్యాలెన్స్ చేసుకుంటూ పని చేయాలి. ముఖ్యంగా వైద్యరంగంలో ఉన్నవారు చేసే మంచి పనులు ఒక్క చిన్న తప్పిదంతో కొట్టుకుపోతాయి. తిట్లు పడతాయి. అయినా సరే చేసే పనిపట్ల గౌరవం, ప్రేమను కోల్పోవద్దు. నిబద్ధతతో పని చేయాలి. నా ఇరవై ఏడేళ్ల కెరీర్‌లో ఈ రోజు అత్యున్నతస్థాయి గుర్తింపు దక్కింది. ఇందుకు చాలా సంతోషంగా ఉంది. అయితే ఈ గుర్తింపు కంటే ముందే అనేక సార్లు ప్రాణాపాయ స్థితిలో ఉన్న వాళ్లను కాపాడినప్పుడు మాటల్లో చెప్పలేనంత ఆనందం, తృప్తి దక్కుతుంది. – సుశీల, అవార్డు గ్రహీత

జిల్లాలోకి రుతుపవనాలు

మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం



ఖమ్మంవ్యవసాయం: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు గురువారం జిల్లాలోకి ప్రవేశించాయి. ఈ ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ వాతావరణ విభాగం, వైరా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వెల్లడించారు. అయితే పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కూడా కురిసే అవకాశం ఉందని తెలిపారు. నైరుతి రుతుపవనాల కారణంగా వాతావరణం చల్లబడడంతో నాలుగు నెలలుగా ఉష్ణోగ్రత, ఉక్కపోతతో తల్లడిల్లిన జిల్లా వాసులు ఉపశమనం పొందారు. ఇక రైతులు ఇరవై రోజులకు పైగా వాన కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వారు పత్తి విత్తనాలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. అయితే వ్యవసాయ శాస్త్రవేత్తలు మాత్రం 60 మి.మీ.ల వర్షపాతం నమోదైతే సాగు పనులు మొదలుపెట్టాలని సూచించారు.

దేవాలయ భూముల్లో సర్వే

చింతకాని: మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ భూములను దేవాదాయ శాఖ అధికారులు గురువారం సర్వే ప్రారంభించారు. జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్ నూర్దు ఆధ్వర్యాన 242 ఎకరాల పట్టా భూమికి హద్దులు నిర్ధారించేందుకు గాను ఈ సర్వే చేపట్టారు. రెండు రోజుల్లో ఈ సర్వే పూర్తవుతుందని అధికారులు తెలిపారు. దేవాదాయశాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, ఆలయ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు, ఈఓ చుండూరు రామకోటేశ్వరరావుతో పాటు వెంకయ్య, జయంతి, ఉమామహేష్, తోటకూరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వాళ్లు తట్టెడు మట్టీ పోయలేదు..

- తెలంగాణ వచ్చాకే ప్రాజెక్టులు పూర్తిచేశాం
- అమరవీరుల త్యాగాలు సదా స్మరణీయం
- కేఎంసీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



జిల్లా ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న మంత్రి పువ్వాడ, కలెక్టర్ గౌతమ్, మేయర్ నీరజ, ఎమ్మెల్సీ మధు, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పువ్వాడ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాంతంలో ప్రాజెక్టుల నిర్మాణాలకు కొబ్బరి కాయలు కొట్టారే తప్ప ఎక్కడా తట్టెడు మట్టి పోసి నిర్మాణాలు చేపట్టలేదని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ వచ్చాకే ప్రాజెక్టుల నిర్మాణం పూర్తిచేసుకున్నామని తెలిపారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అమరవీరుల సంస్మరణ తీర్మానం ప్రవేశపెట్టేందుకు గురువారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో ఉద్యమ నాయకుడు కేసీఆర్ సారథ్యాన తెలంగాణ ఏర్పడగా.. ప్రాజెక్టులు పూర్తి చేసుకొని, సాగు, తాగునీరు ఇవ్వగలుగుతున్నామని తెలిపారు. అలాగే, అభివృద్ధి, సంక్షేమం విషయంలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సమయంలో అబద్ధాలు చెప్పి తెలంగాణలోకి రావాలని యత్నిస్తున్న సమైక్య పార్టీల విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు యత్నించి డబ్బుతో పట్టుబడిన వ్యక్తి ఈరోజు పీసీసీ చీఫ్‌గా ఉండి నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఏదిఏమైనా పథకాలన్నీ కొనసాగాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి కేసీఆర్ మూడోసారి సీఎం కావాల్సి ఉందని పువ్వాడ తెలిపారు. కాగా, తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకున్నామని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ సమైక్యాంధ్రలో అన్ని రంగాల్లో వెనుకబడ్డ తెలంగాణ ఇప్పుడు ఊహించని విధంగా జరిగిన అభివృద్ధితో దేశానికే ఆదర్శంగా మారిందని తెలిపారు. తొలుత మేయర్ పునుకొల్లు నీరజ ప్రవేశపెట్టిన అమరవీరుల సంస్మరణ తీర్మానాన్ని కార్పొరేటర్లు బలపరిచి ఆమోదం తెలిపారు. అలాగే, అమరవీరులను స్మరించుకుంటూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా పదేళ్ల ఖమ్మం జిల్లా ప్రగతి నివేదికను మంత్రి పువ్వాడ ఆవిష్కరించారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు, ఉద్యమకారులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళి

అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మం పెవిలియన్ మైదానం సమీపంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ తదితరులు నివాళులర్పించి అమరుల త్యాగాలను స్మరించుకున్నారు.

రహదారులకు మహర్దశ

- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నుండి ఉమ్మడి జిల్లాకు రూ.25కోట్లు
- మూడు చోట్ల రోడ్ల విస్తరణ, డ్రెయిన్లు, జంక్షన్ల అభివృద్ధి
- టెండర్ల ప్రక్రియపై దృష్టిసారించిన ఆర్‌అండ్‌బీ ఇంజనీర్లు



విస్తరించనున్న వైరాలోని ప్రధాన రహదారి

ఖమ్మంఅర్బన్/వైరా: ఇరుకురోడ్లపై నిత్యం వాహనాల రద్దీతో ఇక్కట్లు ఎదుర్కొంటున్న ఉమ్మడి జిల్లాలోని మూడు పట్టణాల ప్రజలకు కొంతమేర ఉపశమనం కలగనుంది. ఇరుకురోడ్లు, మురుగునీరు వెళ్లే మార్గం లేక ప్రజలు సతమతమవుతున్న మూడు పట్టణ ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, డ్రెయిన్ల నిర్మాణం, జంక్షన్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నుండి రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో చేపట్టే పనుల టెండర్ల ప్రక్రియపై ఆర్ అండ్‌బీ ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు.

వైరా నియోజకవర్గంలో రెండు చోట్ల..

వైరా నియోజకవర్గంలోనే రెండు చోట్ల రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. వైరాలోని జగ్గయ్యపేట రోడ్డును నాలుగు లేన్లుగా విస్తరించడానికి రూ.12కోట్లు మంజూరు చేశారు. సుమారు రెండు కి.మీ. రోడ్డు విస్తరణ, డివైడర్ల నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు పనులకు ఈ నిధులు వెచ్చిస్తారు. అలాగే, మండల కేంద్రమైన ఏన్కూరు ప్రధాన సెంటర్‌లో జంక్షన్ అభివృద్ధి, డ్రెయిన్ల నిర్మాణం కోసం రూ.3కోట్లు మంజూరు చేశారు. ఇక ఇల్లెందు మున్సిపాలిటీలో ఇల్లెందు నుండి ఖమ్మం వచ్చే ప్రధాన రోడ్డులో రెండు కి.మీ. మేర రోడ్డు నాలుగు లేన్లుగా విస్తరణ, డ్రెయిన్ల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. వైరా, ఏన్కూరు ప్రధాన సెంటర్లలో రహదారులు ఇరుకుగా మారడమే కాక రోడ్లపైకి దుకాణాలు రావడంతో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ చొరవ తీసుకుని కొన్ని నెలల క్రితం మార్కింగ్ పెట్టించి నిర్మాణాలు తొలగించారు. అక్కడ రోడ్లు విస్తరణ చేయడంతో పాటు డ్రెయిన్లు నిర్మించాలని.. లేకపోతే కూల్చివేతలతో ప్రయోజనం ఉండదని స్థానిక వ్యాపారులు, ప్రజలు కలెక్టర్, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో తొలి దశగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు మంజూరయ్యాయి. ఏన్కూరు సెంటర్‌లో ఖమ్మం –వైరా రోడ్డు, ఏన్కూరు–డోర్నకల్ రోడ్డు జంక్షన్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యాన జంక్షన్ అభివృద్ధితోపాటు, ప్రధాన రోడ్డు, డోర్నకల్ రోడ్డు వెంట డ్రెయిన్ నిర్మాణం చేపడుతారు.

మరమ్మతు పనులకు కూడా..

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఐదు నియోజకవర్గాల్లో రహదారుల మరమ్మతులకు కూడా ఇంజనీర్లు గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈమేరకు నియోజకవర్గానికి సుమారు రూ.2 కోట్ల చొప్పున నిధులతో పాటు దెబ్బతిన్న కల్వర్టుల మరమ్మతులకు అదనంగా నిధులు మంజూరైనట్లు తెలిసింది. గత సీజన్‌లో అధిక వర్షాలతో కొట్టుకుపోయిన రహదారులు, గుంతలు పడిన చోట ఈ నిధులతో మరమ్మతులు చేపడుతారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పనులు మొదలయ్యాయి. పల్లిపాడు – ఏన్కూరు మార్గంలో రహదారిపై గుంతలను పూడ్చి రవాణాపరంగా మార్గం సుగమం చేశారు.

రైతుబంధుకు సర్వం సిద్ధం

- జిల్లాలో 3,32,893 మంది రైతులకు రూ.364.23 కోట్లు
- ఈనెల 18 వరకు పట్టాదారు పుస్తకాలు పొందిన వారికీ అవకాశం
- కొత్తగా జాబితాలోకి 15,969 మంది పట్టాదారులు

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం రైతుబంధు అమలుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈనెల 26 నుంచి వానాకాలం రైతుబంధు పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమ చేయనున్నారు. ఈమేరకు విధివిధానాలను ఖరారు చేసిన ప్రభుత్వం గురువారం జిల్లా వ్యవసాయ శాఖకు ఆదేశాలు విడుదల చేసింది. జిల్లాలో రైతుబంధు పథకానికి 3,32,893 మంది రైతులను అర్హులుగా గుర్తించగా, భూమి ఆధారంగా రూ.364.23 కోట్లు కేటాయించింది. అంతేగాక ఈనెల 18వ తేదీ నాటికి నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు కూడా పథకం అమలుచేస్తామని వెల్లడించారు. రైతులు పంటల పెట్టుబడికి ఇబ్బంది పడకుండా 2018 వానాకాలం నుంచి రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలుచేస్తోంది. ఏటా రెండుసార్లు ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.

నూతన పట్టాదారు రైతులకు అవకాశం

నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు కూడా వానాకాలం రైతుబంధు సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 18వ వరకు పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు జిల్లాలో 15,969 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్స్‌ను వ్యవసాయ విస్తరణాధికారులకు అందజేస్తే రైతుబంధు పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. అలాగే, బ్యాంక్ ఖాతాల్లో తప్పులు దొర్లిన వారు కూడా ఏఈఓలను కలిసి సవరించుకోవాలి.

క్లుప్తంగా

ఐపీఎస్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం



ఆశ్రిత్‌ను సత్కరిస్తున్న ఏసీపీ రెహమాన్

వైరా: హనుమకొండ జిల్లా కేంద్రానికి చెందిన శాఖమూరి శ్రీసాయి ఆశ్రిత్ ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియా 40వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా తన తండ్రి అమర్‌తో కలిసి గురువారం వైరాకు రాగా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్ ఆయనను సన్మానించారు. గత ముప్పై ఏళ్లుగా ఆశ్రిత్, ఏసీపీ కుటుంబాల నడుమ స్నేహ సంబంధాలు ఉండడంతో కలిసేందుకు వచ్చినట్లు తెలిపారు.

హెచ్‌ఎం తీరుపై గ్రామస్తుల నిరసన

మధిర: మండలంలోని దెందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణదాసు తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం నిరసన తెలిపారు. పాఠశాలకు చెందిన ఓ విద్యార్థినితో ఆయన అసభ్యంగా ప్రవర్తించడమే కాక, టీసీ ఇచ్చేస్తానని చెప్పినట్లు సమాచారం. దీంతో వివాదం మొదలైంది. హెచ్‌ఎం విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదని, దళితులపై వివక్ష చూపిస్తున్నారని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈమేరకు విషయం తెలుసుకున్న ఎంఈఓ ప్రభాకర్ డీఈఓకు ఫోన్‌లో సమస్యను వివరించారు.

కుక్కల దాడిలో తల్లీకొడుకులకు గాయాలు

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం పండితాపురంలో కుక్కల దాడిలో తల్లీకొడుకులు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన తల్లీకొడుకులు సుజాత, బాలరాజు ఇంటి ఆరుబయట కూర్చుని ఉండగా ఒక్కసారిగా వచ్చిన మూడు కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో వీరిని చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

చెల్లని చెక్కు కేసులో మూడు నెలల జైలు

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో వ్యక్తికి మూడు నెలల జైలుశిక్ష విధించడంతో పాటు ఫిర్యాదికి రూ.5లక్షలు చెల్లించాలని ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి కాసరగడ్డ దీప గురువారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంకు చెందిన మందడపు విజయలక్ష్మి వద్ద బండారు మహేష్ 2015 మే 15న రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆతర్వాత 2016లో రూ.2.50 లక్షలకు చెక్ జారీ చేయగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తే నగదు లేకపోవడంతో బౌన్స్ అయింది. దీంతో విజయలక్ష్మి తన న్యాయవాది ఆర్.నారాయణస్వామి ద్వారా ప్రైవేట్ కేసు దాఖలు చేయడంతో విచారించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఏన్కూరు: కులం పేరుతో దూషించిన వ్యక్తులపై పోలీసులు గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మండలంలోని నాచారానికి చెందిన మలిపెద్ది శ్రీదేవి తన పొలాన్ని రాజులపాలెంకు చెందిన అజ్మీర శ్రీరాం మూడేళ్లుగా కౌలుకు ఇస్తోంది. ఈసారి కూడా శ్రీరాం కౌలుకు తీసుకుని ఈనెల 21న ఆయన తల్లి భద్రి పొలంలో పనిచేస్తుండగా శ్రీదేవి భర్త రాజేశ్వరావు, కుమారుడు జస్వంత్ వచ్చి ఆమెను కులంపేరుతో తిడుతూ కొట్టారు. అడ్డుపడిన వీరన్న అనే వ్యక్తిని సైతం కులం పేరుతో దూషించారు. దీంతో బద్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాదావత్ రవి తెలిపారు.

కానిస్టేబుల్ రెండో పెళ్లి..

ఆత్మహత్యకు యత్నించిన మొదటి భార్య

ఖమ్మంక్రైం: కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి రెండో వివాహం చేసుకున్నా.. పోలీసులు తనకు న్యాయం చేయడం లేదనే ఆవేదనతో ఆయన మొదటి భార్య గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఖమ్మం అర్బన్ పరిధిలోని బల్లేపల్లికి చెందిన లీలావతి భర్త యాదగిరి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన ఇటీవల రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో లీలావతి మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎవరూ పట్టించుకోలేదని చెబుతూ సీపీ కార్యాలయానికి బయలుదేరింది. పిల్లలతో ఆటోలో వెళ్తున్న ఆమె మార్గమధ్యలో వ్యవసాయ మార్కెట్ వద్ద దోమల మందు తాగింది. దీంతో సమాచారం అందుకున్న త్రీటౌన్ కానిస్టేబుల్ ఘటనాస్థలికి చేరుకుని ఆమెను జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,800	1,600
పెసలు	7,900	4,800
కందులు	8,300	7,800
మిర్చి	21,000	12,500
ఏసీ మిర్చి	24,700	18,500
మిర్చి తాలు	13,000	8,000
పత్తి	7,900	5,050

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,346

అమరుల త్యాగఫలమే తెలంగాణ

- దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జెడ్పీలో సంస్మరణ సభ
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, ఎమ్మెల్సీ మధు, కలెక్టర్ గౌతమ్



అమరవీరుల కుటుంబీకులను సన్మానించిన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, ఎమ్మెల్సీ మధు, కలెక్టర్ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్, అదనపు కలెక్టర్ స్నేహలత తదితరులు

ఖమ్మం సహకారనగర్: అమరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమరుల సంస్మరణ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. అనంతరం అమరులను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

ఎవరేం అన్నారంటే...

జెడ్పీ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో చైర్మన్ కమల్‌రాజ్ మాట్లాడుతూ.. తొలి, మలి, తుదిదశ ఉద్యమాల్లో రాష్ట్ర సాధన కోసం అనేక మంది ప్రాణాలు అర్పించారని తెలిపారు. 2001లో సీఎం కేసీఆర్ ఉద్యమాన్ని ప్రారంభించి పద్నాలుగేళ్ల పాటు పోరాడగా, అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావడంతో తెలంగాణ ఏర్పడిందని చెప్పారు.

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ.. అమరుల త్యాగంతో ఏర్పడిన తెలంగాణలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలవుతున్నాయని తెలిపారు. గత 20 రోజులుగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని చెప్పారు. తెలంగాణ కోసం జిల్లాలో ప్రాణాలర్పించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం, అర్హులైన వారికి ఉద్యోగం కల్పించి ప్రభుత్వం అండగా నిలిచిందని పేర్కొన్నారు.
- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ.. అమరుల ఆశయాల సాధన దిశగా అందరూ కృషి చేయాలని, వారి ఆశయాలను నిరంతరం గుర్తు చేసుకోవాలని సూచించారు.
- సీపీ విష్ణు ఎస్.వారియర్ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణ ఏర్పడి ఎంతో అభివృద్ధి సాధించామని చెప్పారు. ఆ అభివృద్ధిని ప్రజలకు తెలియజేసేలా కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందించి క్షేత్రస్థాయికి తీసుకెళ్లిందని తెలిపారు.

అమరుల కుటుంబాలకు సన్మానం..

తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన వారి కుటుంబ సభ్యులను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఖమ్మం బుర్హాన్‌పురానికి చెందిన యలమందల వేణుగోపాల్, నిజాంపేటకు చెందిన అన్నబత్తుల రవీంద్రనాథ్, కస్బాబజార్‌కు చెందిన ఎస్.కే.మహమూద్ పాషా, టేకులపల్లికి చెందిన వెంపటి రామకృష్ణ, వరంగల్ జిల్లా జర్పుల తండాకు చెందిన జర్పుల సురేష్, నల్లగొండ జిల్లా మునగాల మండలం రేపాలకు చెందిన రావు సుధాకర్‌రెడ్డి, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకంపాడుకు చెందిన మీన వేణు, గార్లకు చెందిన కాలా ప్రకాష్‌కుమార్ జైన్ కుటుంబీకులను సన్మానించి అమరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, జెడ్పీ సీఈఓ అప్పారావు, అధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

పాట పాడిన అదనపు కలెక్టర్..



పాట పాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

రాష్ట్ర దశాబ్ది అవతరణ దినోత్సవాల్లో భాగంగా జెడ్పీలో నిర్వహించిన తెలంగాణ అమరుల సంస్మరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ పాట పాడారు. కళాకారులతో కలిసి అమరుల త్యాగాలను పాట రూపంలో గుర్తు చేశారు.

దేశానికి పతకాలు తీసుకురావాలి..

- కలెక్టర్ వీ.పీ.గౌతమ్
- ఉత్సాహంగా ఒలింపిక్ డే రన్



చిన్నారులతో కలిసి పరుగెత్తుతున్న కలెక్టర్ గౌతమ్



జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన డీవైఎస్ఓ పరంధామరెడ్డి తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ క్రీడల్లో మంచి తర్ఫీదు పొంది దేశానికి పతకాలు తీసుకువచ్చే స్థాయికి క్రీడాకారులు ఎదగాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. ఒలింపిక్ డే సందర్భంగా గురువారం నగరంలో నిర్వహించిన రన్‌ను ఆయన సర్దార్ పటేల్ స్టేడియం వద్ద ప్రారంభించారు. ఆతర్వాత ఇల్లెందు క్రాస్‌రోడ్డు మీదుగా జిల్లా కోర్టు, ఇందిరానగర్ క్రాస్ రోడ్డు, మమత రోడ్డు మీదుగా లకారం ట్యాంక్‌బండ్ వరకు చేరింది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని వనరులు, నిపుణులైన కోచ్‌లు ఉన్నందున ఔత్సాహికులు సద్వినియోగం చేసుకుంటూ దూసుకెళ్లాలన్నారు. ఐక్యతను చాటిచేప్పేందుకు క్రీడలు ఉపకరిస్తాయని తెలిపారు. డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి మాట్లాడుతూ.. ఏటా ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్నట్లు చెబుతూ ప్రాధాన్యతను వివరించారు. ఈకార్యక్రమంలో ఒలింపిక్ సంఘం జిల్లా కన్వీనర్ కె.క్రిస్టోఫర్‌బాబు, అధ్యక్షుడు డాక్టర్ రఘునందన్, కోచ్‌లు, క్రీడా సంఘాల బాధ్యులు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్‌అలీ, ఎస్.ఉప్పల్‌రెడ్డి, ఆదర్శ్‌కుమార్, సీహెచ్.రవికుమార్, మతిన్, సాంబమూర్తి, శ్రీనివాస్, మురళిధర్‌రావు, శ్రీనివాసరెడ్డి, రవీంద్ర, ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వెనకకు చూస్తూ.. ముందుకు వెళ్తూ..

ఒలింపిక్ డే రన్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్ ప్రతీ రెండు, మూడు నిమిషాలకోసారి వెనుకకు చూస్తూ ముందుకు సాగారు. రన్ ప్రారంభించిన చోట ఉన్న చిన్నారులు వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అందరూ జాగ్రత్తగా వచ్చేలా చూడాలని పీఈటీలు, క్రీడా సంఘాల బాధ్యులకు సూచించారు. కాగా, రన్‌లో ఎస్సీ, బీసీ, వెల్ఫేర్ హాస్టళ్లు, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు దాదాపు వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు.

సరిహద్దులు దాటిన తంబోలా

- పోలీసుల దాడుల్లో ఇద్దరి అరెస్ట్
- పరారైన వారిలో సస్పెండ్ అయిన కానిస్టేబుల్ కూడా..



పోలీసులు స్వాధీనం చేసుకున్న నంబర్ల పట్టిక

నేలకొండపల్లి: రాష్ట్ర సరిహద్దు మండలాల్లో తంబోలా గేమ్(నంబర్ ఆట) జోరందుకుంది. ఈమేరకు పోలీసులు చేసిన దాడుల్లో ఇద్దరు పట్టుబడగా, మరికొందరు పరారయ్యారు. నేలకొండపల్లి మండలంలోని అప్పలనరసింహాపురం గ్రామం రాష్ట్ర సరిహద్దుగా ఉండడంతో అనువుగా భావించిన పలువురు గ్రామ నడిబొడ్డున తంబోలా గేమ్ ఆడుతున్నారు. ఇందుకోసం మండలంలోని కొంగర, కట్టుకాసారాం, అప్పలనరసింహాపురం, ముదిగొండ మండలంలోని వల్లభి, ఏపీలోని అనుమంచిపల్లి గ్రామాలకు చెందిన పలువురు వచ్చి వెళ్తుండగా రూ.లక్షల్లో చేతులు మారుతున్నట్లు సమాచారం. ఈ విషయమై పోలీసులు గురువారం ఆకస్మిక దాడులు చేయగా.. నిర్వాహకులు, ఆడేవారు పరుగులు తీయగా.. ఇరువురి పట్టుబడ్డారు. వీరి నుంచి ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా, పరారైన వారిలో సస్పెన్షన్‌లో ఉన్న ఓ కానిస్టేబుల్ కూడా ఉన్నారని ఎస్సై ప్రవంతి తెలిపారు.

రామాలయంలో ముగిసిన దశాబ్ది ఉత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఈఓ రమాదేవి తదితరులు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శాశ్వత నిత్యాన్నదానానికి వితరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో 20 రోజులుగా జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకలు గురువారం ముగిశాయి. చివరి రోజున ఆలయ ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు ఈఓ రమాదేవి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఈఈ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న స్వామీజీ..

శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని శ్రీ దేవనాద రామానుజ జీయర్ స్వామీజీ గురువారం దర్శించుకున్నారు. ఈఓ, అర్చకులు స్వాగతం పలకగా, ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కాగా, ఆలయంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భద్రాచలానికి చెందిన గట్టు వెంకటాచార్యులు, వైదేహి దంపతులు రూ. 51,116 విరాళంగా స్వామీజీ చేతుల మీదుగా అందించగా, వారికి ఈఓ రమాదేవి రశీదు ఇచ్చారు.

కమనీయంగా నిత్యకల్యాణం

స్వామి వారి నిత్యకల్యాణ వేడుకను బేడా మండపంలో కమనీయంగా నిర్వహించారు. తెల్ల వారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు.

క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి

ఖమ్మం సహకారనగర్: యువత, ఆసక్తి కలిగిన విద్యార్థులు రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు సూచించారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య అధ్యక్షతన జరిగిన మహిళా కార్యవర్గ సమావేశంలో క్విజ్ పోటీల పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హయాంలో మహిళలపై దాడులు పెరిగాయని తెలిపారు. ఈమేరకు ప్రతీ మహిళా కార్యకర్త కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేయాలన్నారు. అలాగే, రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో ఎక్కువ మంది పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మహిళా కాంగ్రెస్ మండలాల అధ్యక్షులుగా నియమితులైన వారికి పత్రాలు అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు నీలం పద్మ, పగడాల మంజుల, ఏలూరి రజిని, గుడిపుడి ఝాన్సీ, రేణుక, దేవత దివ్య, పుష్ప, వినోద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



క్విజ్ పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

విదేశాల్లో ఉద్యోగాలకు రేపు రిజిస్ట్రేషన్లు

సింగరేణి(కొత్తగూడెం): జర్మనీ, ఆస్ట్రేలియా దేశాల్లో ఉద్యోగాల కోసం అర్హులైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిరుద్యోగులు కలెక్టరేట్‌లో ఈ నెల 24న పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఉపాధి కల్పనాధికారి వేల్పుల విజేత తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జర్మనీలో మీట్ ప్రాసెసింగ్, ఫుడ్ రిటైల్ సేల్స్, కన్‌స్ట్రక్షన్ వేర్‌హౌస్, ట్రక్ డ్రైవర్, ఫిట్టర్, టర్నర్, సీఎస్‌పీ ఆపరేటర్ పోస్టులు ఉన్నాయని, 60 శాతం మార్కులతో ఐటీఐలో ఉత్తీర్ణత సాధించిన 22 – 28 ఏళ్ల మధ్య వయసు వారు అర్హులని చెప్పారు. ఆస్ట్రేలియాలో మైనింగ్ ఇండస్ట్రీ, ప్లాంట్ మెకానిక్, మెకానిక్ ఫిట్టర్, మెకానిక్ ఇంజనీర్, కన్వేయర్ బెల్ట్ టెక్నీషియన్, సీఎస్‌పీ మెషినిస్ట్, వెల్డర్, బాయిలర్ మేకర్, ఫ్యాబ్రికేటర్ ఉద్యోగాలకు 40 ఏళ్ల లోపు వయసుండి, డిప్లొమా మెకానిక్, ఐటీఐ మెకానిక్ లేదా వెల్డర్ ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు ఈనెల 24న ఉదయం 10 గంటల నుంచి కలెక్టరేట్‌లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి

ఖమ్మం క్రైం: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి లభించింది. ఖమ్మం సీసీఎస్ పోలీస్‌స్టేషన్ సీఐ మల్లయ్యస్వామి, పోలీస్‌ట్రైనింగ్ సెంటర్ సీఐ సాంబరాజుతో పాటు భద్రాద్రికొత్తగూడెం జిల్లా ఇంటిలెజెన్స్ సీఐగా పనిచేస్తున్న వెంకన్నబాబుకు పదోన్నతుల జాబితాలో స్థానం దక్కింది. వీరందరూ 1996 బ్యాచ్‌కు ఎస్సైలు కాగా, గురువారం ఉద్యోగోన్నతి ఉత్తర్వులు వెలువడ్డాయి.

దగా పడ్డ తెలంగాణలో వేడుకలా?

మాజీ ఎంపీ వి.హన్మంతరావు




మాట్లాడుతున్న మాజీ ఎంపీ వీహెచ్, పక్కన నాయకులు



తోపులాట జరుగుతున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: దగా పడిన తెలంగాణలో దశాబ్ది ఉత్సవాల పేరిట బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తోందని మాజీ పార్లమెంట్ సభ్యుడు వి.హన్మంతరావు ఆరోపించారు. టీ పీసీసీ పిలుపుమేరకు ఖమ్మం చర్చి కాంపౌండ్ సెంటర్‌లో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యాన ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈకార్యక్రమంలో వీహెచ్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను దగా చేసిన బీఆర్‌ఎస్‌కు దశాబ్ది ఉత్సవాలు నిర్వహించే అర్హత లేదన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఉద్యమ ఆకాంక్షలను తుంగలో తొక్కారని ఆరోపించారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇంటికో ఉద్యోగం, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, పోడు భూములకు పట్టాల పంపిణీ తదితర హామీల అమల్లో విఫలమయ్యారని విమర్శించారు. అనంతరం మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు, కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా ప్రజలకు దగా చేస్తూ, ఇప్పుడు ప్రజాధనంతో పార్టీ ప్రచారం చేసుకుంటోందని ఆరోపించారు. అనంతరం ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసే క్రమంలో భారీగా మొహరించిన పోలీసులు కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. నాయకులు రాయల నాగేశ్వరరావు, దొబ్బల సౌజన్య, లాకావత్ సైదులు, ముజాహిద్ హుస్సేన్, శంకర్, ఆనందరావు, లక్ష్మణ్, దాసరి పూర్ణచందర్ రావు, కళంగి కనకరాజు, దొడ్డ ప్రవీణ్, సయ్యద్ మహమూద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న పాలేరు నీటిమట్టం



అడుగంటిన పాలేరు రిజర్వాయర్

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ నీటిమట్టం గురువారానికి 13.85 అడుగులకు చేరింది. వర్షాలు మరింత ఆలస్యమైతే నీటి మట్టం ఇంకా తగ్గే అవకాశముంది. ప్రస్తుతం రిజర్వాయర్ నుంచిరోజూ 125.60 క్యూసెక్కుల నీటిని తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ప్రాజెక్టుకు వినియోగిస్తున్నారు. ఇక పాలేరు చిన్న కాల్వ కింద సాగుచేసిన చెరుకు పంటకు, వరి నారు పోసుకునేందుకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీరు వదులుతున్నారు. దీనికి తోడు వర్షాలు లేకపోవడంతో నీటిమట్టం తగ్గుతూ వస్తుంది. కాగా, సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తేనే ఈ పరిస్థితి ఉండదని చెబుతున్నారు. అయితే, సాగర్ ఎడమ కాల్వకు పలు చోట్ల మరమ్మతులు కొనసాగుతుండడంతో ఇప్పటికిప్పుడు నీరు విడుదల చేసే అవకాశాలు లేవని సమాచారం. ఒకవేళ వర్షాలు ఇంకా ఆలస్యమైన, నీటి మట్టం మరింత పడిపోతే తప్పని పరిస్థితుల్లో సాగర్ జలాలను పాలేరుకు విడుదల చేసే ఏర్పాట్లు చేస్తామని జల వనరుల శాఖ అధికారి ఒకరు తెలిపారు.

పేకాట స్థావరాలపై దాడులు

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని ఓ హోటల్‌లో కొందరు పేకాట ఆడుతున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.87,700 నగదు, మూడు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు, ఒక కారు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

వైరాలో...: వైరా: వైరా చెరువు బజార్‌లోని ఖాళీ ప్రదేశంలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై మేడా ప్రసాద్ ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఐదుగురు పరారీ కాగా ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.3,050 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కల్లూరు: కల్లూరులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పెనుబల్లి మండలం టేకులపల్లికి చెందిన అలవాల ప్రసాద్(45) బుధవారం రాత్రి తల్లాడ నుంచి టేకులపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కల్లూరు కృష్ణా ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా జాతీయ రహదారిపై వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన కుమారుడి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రిజర్వాయర్‌లో పడి వృద్ధుడు...

కొణిజర్ల: ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లోని నీటి గుంటలో పడిన ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఎస్‌ఐ జె.శంకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్ మండలం చిన్నబీరవల్లికి చెందిన కొప్పుల దాసు(75) వైరా మాటూరుపేట ఆర్‌సీఎం చర్చి రోడ్డులో ఉంటున్న తన కుమారుడు కాంతారావు ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం బహిర్భూమి కోసం వైరా రిజర్వాయర్ వద్దకు వెళ్లగా..ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందాడు. ఉదయం 11 గంటలకు స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని తీయించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

కొబ్బరి చెట్టు పైనుంచి పడి వ్యక్తి..

వేంసూరు: కొబ్బరి చెట్టుపై నుంచి కిందపడిన ఓ వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని లచ్చన్నగూడెంకు చెందిన తేళ్లూరి కృపానందం(38) కొబ్బరి చెట్టు మట్టలు నరికేందుకు ఎక్కాడు. ఈక్రమంలో పట్టు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

బావమరిదిపై బావ కత్తితో దాడి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం బల్లేపల్లికి చెందిన వి.శ్రీనుపై ఆయన బావ కత్తితో దాడి చేయగా తీవ్రగాయాలైనట్లు తెలిసింది. స్థానికులు కథనం ప్రకారం.. బావ, బావమరిది గురువారం ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో శ్రీను మెడపై ఆయన బావ కత్తితో నరికే యత్నం చేయగా తప్పించుకునే క్రమంలో కాలికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఈఘటనపై ఖమ్మం అర్బన్ సీఐ శ్రీహరిని వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

క్లుప్తంగా...

సీఎం బోనాల శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: గోల్కొండ ఆషాఢ బోనాల పండుగ ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు గురువారం రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే బోనాలను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నదని, తద్వారా తెలంగాణ సబ్బండ వర్గాల సంస్కృతికి పెద్దపీట వేసిందన్నారు. తరతరాల తెలంగాణ సాంస్కృతిక ఆధ్యాత్మిక అస్తిత్వానికి బోనాల పండుగ ప్రతీకగా నిలిచిందన్నారు. బోనాల పండుగ ప్రారంభంనాడు వాన చినుకుల రూపంలో మనందరిమీద అమ్మవారు కరుణాకటాక్షాలు కురిపిస్తుండటం శుభసూచకమని అన్నారు.

అదనంగా 880 పాస్‌పోర్టు అపాయింట్‌మెంట్లు



దాసరి బాలయ్య

కంటోన్మెంట్: పాస్‌పోర్టుల దరఖాస్తుల డిమాండ్ దృష్ట్యా ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు అదనంగా 880 అపాయింట్‌మెంట్‌లు ఇవ్వనున్నట్లు సికింద్రాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ దాసరి బాలయ్య ఓ ప్రకటనలో తెలిపారు. బేగంపేట, అమీర్‌పేట, టోలిచౌకితో పాటు కరీంనగర్, నిజామాబాద్‌లలోని పాస్‌పోర్టు సేవా కేంద్రాల్లో రోజుకు 220 చొప్పున అదనపు అపాయింట్‌మెంట్‌లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ అదనపు అపాయింట్‌మెంట్‌లను పాస్‌పోర్ట్ సేవా వెబ్‌సైట్‌లో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు విడుదల చేస్తామని పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారితో ఇదివరకే దరఖాస్తు చేసుకున్నవారు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు.

పీఆర్‌సీ బకాయిల సాధనకు డాక్టర్ల కార్యాచరణ

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ బోధనా వైద్యుల పీఆర్సీ బకాయిల ఫైల్ ముఖ్యమంత్రి కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని, దాని సాధనకు కార్యాచరణ చేపట్టాలని తెలంగాణ టీచింగ్ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిరణ్ మాదల, కార్యదర్శి జలగం తిరుపతిరావు తెలిపారు. ఈ మేరకు గురువారం సంఘం కోర్ కమిటీ సమావేశం జూమ్ మీటింగ్ నిర్వహించారు. జూలై 9న సర్వసభ్య సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందించనున్నట్లు వారు చెప్పారు.

ఎట్టకేలకు ఎంట్రీ

రాష్ట్రంలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు



యాదాద్రి కొండకు దిగువన ఉన్న చెరువుగా మారిన సెంట్రల్ పార్కింగ్ స్థలంలో నీట మునిగిన కార్లు


సాక్షి, హైదరాబాద్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. బుధవారం నాటికి ఆంధ్రప్రదేశ్ అంతటా వ్యాప్తి చెందిన రుతుపవనాలు... గురువారం కల్లా తెలంగాణలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం ఖమ్మం జిల్లా పరిసరాల వరకు వ్యాప్తి చెందిన రుతుపవనాలు.. రెండు, మూడు రోజుల్లో తెలంగాణ అంతటా విస్తరిస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది జూన్ మొదటివారం కల్లా రాష్ట్రమంతటా విస్తరించిన రుతుపవనాలు... ఈసారి రెండువారాలకు పైబడి ఆలస్యంగా రాష్ట్రంలోకి ప్రవేశించాయి. సాధారణంగా జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు కాలాన్ని నైరుతి సీజన్‌గా పరిగణిస్తారు. ఈ క్రమంలో జూన్ మొదటి వారంలో తొలకరి జల్లులతో ప్రారంభమై క్రమంగా మోస్తరు నుంచి భారీ, అతి భారీ వర్షాలు నమోదవుతాయి. సీజనల్ వర్షాలు వ్యవసాయానికి అత్యంత కీలకం. కానీ ఈసారి తొలకరి వర్షాలు ఆలస్యం కావడంతో రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రుతుపవనాలు చురుకుగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ రానున్న కాలంలో ఎలాంటి వాతావరణం నెలకొంటుందో వేచి చూడాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. తొలకరి వర్షాలు చూసి విత్తనాలు నాటకుండా కాస్త వేచిచూడడమే మంచిదని సూచిస్తున్నారు.

మొదలైన వానలు

రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తొలకరి వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లోని పలు ప్రాంతాలపై గురువారం రుతుపవనాల ప్రభావం ఉన్నట్లు వాతావరణ శాఖ చెబుతోంది. ప్రస్తుతానికైతే రుతుపవనాలు చురుకుగా ముందుకు కదులుతున్నాయి. ఇదే వేగాన్ని కొనసాగిస్తే రానున్న మూడురోజుల్లో రాష్ట్రమంతటా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నట్లు నిపుణులు సూచిస్తున్నారు. జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా నమోదు కావాల్సిన సాధారణ వర్షపాతం 12.93 సెంటీమీటర్లు. కాగా జూన్ 22 నాటికి 9.15 సెంటీమీటర్ల సాధారణ వర్షం కురవాలి. కానీ రుతుపవనాల రాక ఆలస్యం కావడం, వర్షాలు అరకొరగా మాత్రమే పడటంతో ఈనెల 22 నాటికి కేవలం 2.31 సెంటీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. సాధారణంగా నమోదు కావాల్సిన వర్షపాతంలో 75 శాతం లోటు ఉన్నట్లు స్పష్టమవుతోంది. కాగా గురువారం రాష్ట్రవ్యాప్తంగా 0.5 సెంటీమీటర్ల (5 మిల్లీమీటర్లు) సగటు వర్షపాతం నమోదైంది. వరంగల్, హనుమకొండ, సిద్దిపేట, జనగామ, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, గద్వాల, నల్లగొండ జిల్లాల్లో పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కాగా యాదగిరిగుట్ట పట్టణంతో పాటు యాదాద్రి కొండపై గురువారం భారీ వర్షం కురిసింది. కొండపై భక్తులు తల దాచుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. కొండ కింద గల సెంట్రల్ పార్కింగ్‌లో వాహనాలు నీట మునిగిపోయాయి.

ఉపరితల ఆవర్తనం.. పశ్చిమ దిశ నుంచి గాలులు

రానున్న రెండ్రోజులు రాష్ట్రంలోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలు, ఉత్తరాంధ్ర – దక్షిణ ఒడిశా తీరాలకు దగ్గరలో సగటు సముద్ర మట్టం నుంచి 3.1 – 5.8 కిలోమీటర్ల వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడినట్లు తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు నమోదు కానున్నాయి. ప్రస్తుతం రాష్ట్రానికి పశ్చిమ దిశ నుంచి రాష్ట్రానికి బలంగా గాలులు వీస్తున్నాయని వివరించింది.



పిడుగుపాటుకు రైతు మృతి



ఇంద్రసేనారెడ్డి

శంషాబాద్ రూరల్: మండలంలోని నానాజీపూర్ గ్రామానికి చెందిన అయినాల ఇంద్రసేనారెడ్డి (46) గురువారం సాయంత్రం కౌలు భూమిలో బంతినారు వేస్తున్నాడు. ఇంతలో ఉరుములు, మెరుపులతో వాన ప్రారంభం కాగా అతనిపై పిడుగు పడింది. దీంతో స్పృహ తప్పిన ఇంద్రసేనారెడ్డిని స్థానికులు శంషాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. అతనికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

ఆయన తీర్పులు మార్గనిర్దేశకాలు

- జస్టిస్ రామసుబ్రమణియన్ తీర్పులపై హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామసుబ్రమణియన్ తీర్పులు ఇతర న్యాయమూర్తులకు మార్గనిర్దేశం చేస్తాయని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టును దశాబ్దాలుగా పీడిస్తున్న నిజాం కాలంనాటి భూతగాదాల పరిష్కారానికి జస్టిస్ రామసుబ్రమణియన్ తీసుకున్న నిర్దిష్ట చర్యల గురించి అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ గుర్తుచేయగా.. అటువంటి పెండింగ్ వివాదాలన్నింటినీ (ఇ –14 తదితర పిటిషన్లుగా పిలుస్తారు) పరిష్కరిస్తానని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ వెల్లడించారు. హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) ఆధ్వర్యంలో గురువారం హైకోర్టు ఆవరణలో జస్టిస్ రామసుబ్రమణియన్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సీజే హాజరై మాట్లాడారు. చూసేందుకు చాలా సింపుల్‌గా కనిపించినా, అత్యంత తెలివైన వ్యక్తి జస్టిస్ రామసుబ్రమణియన్ అని బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి కొనియాడారు. జస్టిస్ రామసుబ్రమణియన్ మాట్లాడుతూ 2016లో మద్రాస్ హైకోర్టు నుంచి బదిలీపై హైదరాబాద్ హైకోర్టుకు న్యాయమూర్తిగా వచ్చానని.. నాటి నుంచి న్యాయమూర్తులు, న్యాయవాదులు తనపై చూపుతున్న అభిమానం అపారమైనదన్నారు. దీనికిగాను వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ పి.నవీన్‌రావు, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు, అదనపు అడ్వొకేట్ జనరల్ జె.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ రామసుబ్రమణియన్ దంపతులను సన్మానిస్తున్న సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ తదితరులు

ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న తేజావత్ సుశీల

- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నర్సుకు ఉత్తమ అవార్డు ప్రదానం చేసిన రాష్ట్రపతి
- 2022 సంవత్సరానికిగాను ఏఎన్ఎమ్ కేటగిరీలో పురస్కారం

సాక్షి, న్యూఢిల్లీ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన తేజావత్ సుశీల జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును అందుకున్నారు. దేశవ్యాప్తంగా నర్సులు చేస్తున్న ఉత్తమ సేవలకుగాను జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డులను ఏటా కేంద్ర ఆరోగ్య, కు టుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్నారు. గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో 2022, 2023 సంవత్స రాలకుగాను జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుల ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అందించారు. ఇందులో 2022కుగాను ఏఎన్ఎమ్ కేటగిరీలో తెలంగాణకు చెందిన నర్సు తేజావత్ సుశీల రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రగుంట సమీపంలో కనీసం రహదారి సదుపాయం కూడా లేని మారుమూల ప్రాంతంలో ఉండే గుత్తికోయలకు అందించిన సేవలకు గుర్తుగా నైటింగేల్ అవార్డును అందించినట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. 1973 నుంచి ఈ ఏడాది వరకు మొత్తం 614 మంది నర్సులు ఉత్తమ నర్సులకు నైటింగేల్ అవార్డులు అందుకున్నారని కేంద్రం తెలిపింది.

డీఆర్‌డీఓ శాస్త్రవేత్తకు గోల్డెన్ పీకాక్ ఎకో ఇన్నోవేషన్ అవార్డు

భూమిలో కలిసిపోయే పాలిథిన్ కవర్లను తయారుచేసిన డాక్టర్ వీరబ్రహ్మం

సాక్షి, హైదరాబాద్: పర్యావరణ హితమైన క్యారీ బ్యాగ్‌లు రూపొందించిన డీఆర్‌డీఓ (డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్)కు చెందిన చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ కె.వీరబ్రహ్మంకు గోల్డెన్ పీకాక్ ఎకో ఇన్నోవేషన్ అవార్డు–2023 పురస్కారం లభించింది. ఈ మేరకు గురువారం బెంగళూరులో నిర్వహించిన 'ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, క్లైమెటిక్ చేంజ్–2023'సదస్సులో భాగంగా కర్ణాటకకు చెందిన మాజీ న్యాయమూర్తి రితూరాజ్ అవస్థీ ఈ అవార్డును వీరబ్రహ్మంకు ప్రదానం చేశారు. సాధారణంగా మనం వినియోగిస్తున్న పాలిథిన్ క్యారీబ్యాగ్‌లు భూమిలో, నీటిలో కరగవు. అవి విచ్ఛిన్నం కావడానికి 300 నుంచి 500 ఏళ్ల సమయం పడుతుంది. దీని వల్ల భూమి మీద ప్లాస్టిక్ వ్యర్థాలు గాలి, నీటి కాలుష్యానికి కారణం అవుతున్నాయి. ప్లాస్టిక్ భూతాన్ని అంతమొందించేందుకు పాలిథిన్ బ్యాగ్‌లకు ప్రత్యామ్నాయంగా 120 రోజుల్లో భూమిలో కలిసిపోయి ఎరువుగా మారే బయోడీగ్రేడబుల్ బ్యాగ్‌లను శాస్త్రవేత్త వీరబ్రహ్మం కనుగొన్నారు. మొక్కజొన్న గంజి, బయోపాలిమర్లను కలిపి దీన్ని ఆయన రూపొందించారు. ఈ బ్యాగ్‌లతో పర్యావరణానికి ముప్పు లేదు. ఈ టెక్నాలజీని డీఆర్‌డీఓ ఇప్పటికే 40 కంపెనీలకు ఉచితంగా అందించింది. వీరబ్రహ్మంకు గోల్డెన్ పీకాక్ అవార్డు దక్కడంపై శాస్త్రవేత్తలు, పర్యావరణ శ్రేయోభిలాషులు అభినందించారు.

అనుమతి లేకుండా అడ్మిషన్లు

- నోటీసులతో సరిపెట్టిన ప్రభుత్వం
- గురునానక్ విద్యార్థుల్లో ఆందోళన



గురునానక్ కళాశాల ఎదుట విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళన

సాక్షి, హైదరాబాద్/ఇబ్రహీంపట్నం: ఎలాంటి అనుమతులు లేని గురునానక్ యూనివర్సిటీలో చేరిన విద్యార్థులు ఆర్థికంగానే కాకుండా, విద్యా సంవత్సరం నష్టపోయామని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇందుకు కారణమైన వర్సిటీపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. కొత్తగా రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీలకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2022లో ఓ చట్ట సవరణ తెచ్చింది. గత ఏడాది సెప్టెంబర్ 13న ఈ బిల్లుకు అసెంబ్లీ కూడా ఆమోదం తెలిపింది. ఆ తర్వాత ఈ బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపారు. ఇప్పటివరకూ దీనిపై గవర్నర్ దగ్గర్నుంచి స్పష్టత రాలేదు. అయితే, గురునానక్‌తోపాటు మరో కాలేజీ కూడా బిల్లుపై స్పష్టత రాకుండానే విద్యార్థులను చేర్చుకుంది. వారి నుంచి భారీగా డబ్బులు వసూలు చేసింది. గురునానక్ కాలేజీలో 3వేల మంది విద్యార్థులు చేరారు. 2022–23 విద్యా సంవత్సరం ముగిసినప్పటికీ అనుమతులు రాకపోవడంతో విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. దీనిపై ప్రభుత్వం సంబంధిత కాలేజీలకు నోటీసులివ్వగా, విద్యార్థుల వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తామని యాజమాన్యాలు చెబుతున్నాయి. అయితే ఈ చర్యతో తమకు జరిగిన నష్టం భర్తీ కాదని విద్యార్థులు అంటున్నారు. తమకు అన్యాయం చేశారంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం కళాశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఆందోళన కారులు కళాశాలలోకి చొరబడి రాళ్లు, కర్రలతో విధ్వంసం సృష్టించారు. దీంతో పోలీసులు లాఠీలు ఝుళిపించి ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు.

జిల్లా వార్తలు


'అపెక్స్' సమావేశంలో డీసీసీబీ చైర్మన్



అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాగభూషణం, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: హైదరాబాద్‌లోని అపెక్స్ బ్యాంక్‌లో గురువారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ కూరాకుల నాగభూషణం పాల్గొన్నారు. అపెక్స్ బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అధ్యక్షతన ఈ సమావేశంలో తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కూరాకులతో పాటు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీధర్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఓసీలో అధికారుల పర్యటన



కే ఓసీలో పర్యటించిన అధికారులు

ఇల్లెందు/టేకులపల్లి: సింగరేణి ఇల్లెందు ఏరియా పరిధిలోని జేకే ఓసీ, కోయగూడెం ఓసీల్లో డీడీఎంఎస్(ఎలక్ట్రికల్)లు గౌరవ్ లడ్డా, ఎస్.ఆనంద్వేల్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఓసీల అధికారులతో కలిసి ఇన్ డోర్, ఔట్ డోర్ సబ్ స్టేషన్లు, క్వారీ పంపింగ్ స్టేషన్, సర్ఫేస్ మైనర్లను తనిఖీ చేసి రక్షణ ఏర్పాట్లపై ఉద్యోగులకు సూచనలు చేశారు. ఓసీల అధికారులు బి.వెంకటేశ్వర్లు, పూర్ణచందర్, చిన్నయ్య, శివప్రసాద్, శ్రీనివాస్, విజయ శేఖర్‌బాబు, ప్రహ్లాద్, సౌరభ్‌సుమన్, శివశంకర్ పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు బీటెక్‌లో ప్రవేశాలు

ఇల్లెందు: సింగరేణి అధికారులు, ఉద్యోగుల పిల్లలకు మంథనిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో బీటెక్ ప్రవేశాలు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏరియా జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. అధికారుల పిల్లలకు 18, ఉద్యోగుల పిల్లలకు 18సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. మైనింగ్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో సీట్లు ఉండగా, తాజాగా ఎంసెట్‌లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు కలిగిన వారు పూర్తి వివరాలతో జూలై 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

తగ్గించినా.. ఇన్ని నిబంధనలా?!



సత్తుపల్లిలో పల్లెవెలుగు బస్సు వద్ద రద్దీ

- పల్లె వెలుగు బస్సుల్లో కొత్తగా టీ–9 టికెట్లు
- 12ఏళ్లు దాటితే మహిళలు, 60ఏళ్లు దాటితే అందరికీ అవకాశం
- వచ్చిన రూట్‌లోనే వెళ్లాలనే నిబంధనపై పెదవి విరుపు
- సమయం, దూరాభారంతోనూ ప్రయాణికుల అనాసక్తి



టీ–9 టికెట్ తీసుకుంటున్న యువతి

సత్తుపల్లిటౌన్: పల్లె వెలుగు బస్సుల్లో రాకపోకలు సాగించేలా ప్రయాణికులను మరింతగా ఆకట్టుకునేందుకు టీఎస్ ఆర్టీసీ ఇటీవల కొత్తగా ఆఫర్ ప్రకటించింది. 12 ఏళ్లు నిండిన మహిళలు, 60 ఏళ్లు నిండిన వారందరికీ రాయితీ సదుపాయం కల్పించారు. వీరిపై ఆర్థిక భారం తగ్గించేందుకు టీ–9 టికెట్ అమల్లోకి తీసుకొచ్చారు. ఈనెల 18వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ టికెట్లను ధర ఆధారంగా చూస్తే భారం తగ్గినట్లే కనిపిస్తున్నా.. అలవి కాని నిబంధనలతో చాలా మందికి ఉపయోగపడడం లేదనే భావన వ్యక్తమవుతోంది.

రూ.100తో రాను, పోను ప్రయాణం..

రూ.100 విలువైన టీ–9 టికెట్ కొనుగోలు చేస్తే మహిళలు, వయోవృద్ధులు పల్లెవెలుగు బస్సుల్లో 50 నుంచి 60 కి.మీ. మేర రానుపోను ప్రయాణించవచ్చు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అవకాశం ఉంటుంది. తద్వారా ఒక్కొక్కరికి రూ.20 నుంచి రూ.40 వరకు ఆదా అవుతుంది. 60 ఏళ్లు నిండిన మహిళలు, పురుషులు ఆధార్‌కార్డును చూపించి ఈ టికెట్ కొనుగోలు చేయవచ్చు. సాయంత్రం ఆరు గంటల వరకు ప్రయాణించే అవకాశం ఉన్నందున ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టికెట్లు విక్రయిస్తున్నారు.

రీజియన్‌లో ఇలా..

ఖమ్మం రీజియన్‌లో ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర, మణుగూరు, భద్రాచలం ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో నిత్యం 73వేల మంది ప్రయాణికులు పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. కాగా రీజియన్‌లోని 109 పల్లె వెలుగు బస్సుల్లో టీ–9 టిక్కెట్ సదుపాయం కల్పించారు. ఉదాహరణకు వీ.ఎం.బంజరు నుంచి ఖమ్మంకు చార్జ్ రూ.70 ఉండగా రాను పోను రూ.140 అవుతుంది. అదే టీ–9 టికెట్‌తో రూ.100కే వెళ్లి రావొచ్చు. ఇలా దూరం కలిసి వచ్చే రూట్లలో ప్రయాణించే బస్సుల్లోనే ఈ టికెట్ అమ్మకాలు సాగుతున్నాయి.

ఖమ్మం రీజియన్‌లో 50 కి.మీ. కన్నా ఎక్కువ దూరం ప్రయాణించే పల్లె వెలుగు బస్సులు

డిపో	బస్సులు
ఖమ్మం	19
సత్తుపల్లి	28
మధిర	25
కొత్తగూడెం	17
భద్రాచలం	14
మణుగూరు	06

నిబంధనలు సడలిస్తే మేలు..

టీ–9 టికెట్ విషయంలో ఎక్కువ మంది ప్రయాణికులు పెదవి విరుస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమలుచేస్తుండడంతో పనులు చూసుకోవడంలో ఆలస్యమైతే టికెట్ చెల్లకుండా పోతుంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దున ఖమ్మం రీజియన్ ఉండడంతో ఆంధ్రా నుంచి సరిహద్దు ఆర్టీసీ డిపోలకు పల్లె వెలుగు బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే టీ–9 టికెట్‌ను తెలంగాణ ప్రాంతానికి మాత్రమే పరిమితం చేయడం గమనార్హం. ఇక వచ్చిన రూట్‌లోనే వెళ్లాలనే నిబంధన విధించగా.. అత్యవసర పనులు ఉంటే ఇతర రూట్లలో వెళ్లేందుకు ఈ టికెట్ ఉపయోగపడని పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి నిబంధనలను సడలిస్తే మరింత మంది టీ–9 టికెట్ కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సద్వినియోగం చేసుకోండి..



ఆర్టీసీ అందిస్తున్న టీ–9 టికెట్‌ను మహిళలు, వయో వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలి. బస్సుల్లోనే కండక్టర్లు ఈ టికెట్లు ఇస్తారు. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే వారికి రానుపోను రూ.20 నుంచి రూ.40 వరకు రాయితీ లభించే అవకాశం ఉంది.

– యు.రాజ్యలక్ష్మి, డిపో మేనేజర్, సత్తుపల్లి

పర్యావరణ పరిరక్షణపై ఏఐజీఎఫ్ ఆరా

మణుగూరు రూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో కేంద్ర ప్రభుత్వ విభాగానికి చెందిన అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్(ఏఐజీఎఫ్) కైలేష్ భీంరావు భవార్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియా జీఎం దుర్గం రాంచందర్, అధికారులతో కలిసి కొండాపురం భూగర్భగని, పీకే ఓసీ, మణుగూరు ఓసీలను పరిశీలించారు. గనుల్లో పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న చర్యలను వ్యూ పాయింట్ నుంచి పరిశీలించిన ఆయన అటవీ అనుమతులను పర్యవేక్షించి అధికారులకు సూచనలు చేశారు. ఆతర్వాత పీకే ఓసీ వద్ద భవార్ మొక్క నాటా రు. మణుగూరు ఎఫ్‌డీఓ సయ్యద్ మక్సూద్ మొహియుద్దీన్, సింగరేణి, అటవీ శాఖల అధికారులు జి.నాగేశ్వరరావు, లక్ష్మీపతిగౌడ్, శ్రీనివాసచారి, రాజేశ్వరరావు, రాంబాబు, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు, లింగబాబు, ఉషాశ్రీ, శ్రీనివాసరావు, మదార్‌సాహెబ్, శ్రీనివాస్, నబీ, కల్యాణ్ పాల్గొన్నారు.

కొత్తగూడెం ఏరియాలో అటవీ ఐఆర్‌ఓ..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం సింగరేణి ఏరియాను ఫారెస్ట్ ఐఆర్‌ఓ మంజునాథ(హైదరాబాద్ రీజియన్) గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా జీఎం శాలెం రాజుతో కలిసి గతంలో మంజూరు చేసిన అటవీ భూములను పరిశీలించారు. ఆతర్వాత జీకే ఓసీ, డంప్ యార్డ్, కృత్రిమ అడవిని పరిశీలించి పర్యావరణ చర్యలపై అవగాహన కల్పించారు. ఫారెస్ట్రీ అడ్వైజర్ సురేంద్రపాండే, డీఎఫ్‌ఓ లక్ష్మణ్ రంజిత్‌నాయక్‌తో పాటు అధికారులు రవిప్రసాద్, అయ్యప్ప, ఉమ, కోటిరెడ్డి, శ్రీరమేష్, సదానందం, హరినారాయణ పాల్గొన్నారు.



మణుగూరు రూరల్ : మొక్క నాటుతున్న ఏఐజీఎఫ్ కైలేష్ భీంరావు

లబ్ధిదారుల ఎంపిక ఇలా..



దరఖాస్తుకు అవసరమైన పత్రాల కోసం ఖమ్మం అర్బన్ తహసీల్‌కు వచ్చిన బీసీలు (ఫైల్)

- రూ.లక్ష ఆర్థిక సాయానికి మార్గదర్శకాలు విడుదల
- 26 లోపు పూర్తి కానున్న దరఖాస్తుల పరిశీలన
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 40,137 దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: బీసీల్లోని చేతి, కుల వృత్తులకు ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తు గడువు తాజాగా ముగిసింది. ఈనేపథ్యాన లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి మార్గదర్శకాలను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. ఖమ్మం జిల్లాలో బీసీల్లోని పలు వర్గాలకు చెందిన 26,480 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 13,657 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు దరఖాస్తుల పరిశీలనకు అనుసరించాల్సిన నిబంధనలతో లబ్ధిదారుల ఎంపికపై ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. మండలాల్లో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్‌లో కమిషనర్లు దరఖాస్తులను పరిశీలించి జాబితా రూపొందించనున్నారు.

రూ.50వేలకు మించి లబ్ధి పొందితే అనర్హులు..

వార్డు, గ్రామస్థాయిలో లబ్ధిదారుల దరఖాస్తులను ఆన్‌లైన్ విధానంలో ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తనిఖీ చేసి గుర్తించాలి. అర్హులైన లబ్ధిదారులను బీసీ చేతి, కుల వృత్తుల వారీగా ఎంపిక చేస్తారు. వ్యక్తిగతంగా వీరు చేస్తున్న వృత్తులను గుర్తిస్తారు. నిరుపేద, వితంతువు, నిరుపేద మహిళ, దివ్యాంగులు, అతి వెనుకబడిన వర్గాల(సంచార జాతులు) వారికి తొలి ప్రాధాన్యత ఇస్తారు. ఇక సంక్షేమ పథకాల కింద రూ.50వేలు అంతకంటే ఎక్కువ లబ్ధి పొందుతున్న వారికి ఈ పథకం వర్తించదు. దరఖాస్తుదారుడు పేర్కొన్న చిరునామాలోనే నివాసం ఉండాలి. కుల ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్నట్లుగా దరఖాస్తుదారుడు ఆయా కుల వృత్తి నిర్వహిస్తూ ఉండాలి. జూన్ 2, 2023 నాటికి లబ్ధిదారుడికి 18 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు ఉండాలి. లబ్ధిదారుడి వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాతాల్లో రూ.2లక్షలకు మించరాదు. అందిన దరఖాస్తుల పరిశీలనను మండల స్థాయిలో ఎంపీడీఓ, మున్సిపాలిటీలో కమిషనర్లు ఈనెల 26లోగా పూర్తిచేసి అర్హుల జాబితాను జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి(డీబీసీడీఓ)కి పంపుతారు.

జిల్లా కమిటీదే ఎంపిక బాధ్యత..

జిల్లాస్థాయిలో లబ్ధిదారుల జాబితా ఆధారంగా గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి పొందారా అనే విషయాన్ని డీబీసీడీఓ తనిఖీ చేస్తారు. ఆతర్వాత ఎంపిక కోసం కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా సెలక్షన్ కమిటీకి సిఫారసు చేస్తారు. కలెక్టర్, ఇన్‌చార్జి జిల్లా మంత్రి వద్ద అనుమతి తీసుకుని రూపొందించిన జాబితాను మండల, గ్రామ స్థాయిలో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారు. క్రమసంఖ్య ఆధారంగా ప్రతి నెలా 15వ తేదీన జిల్లా, నియోజకవర్గ స్థాయిలో నిధులు విడుదల చేస్తారు. కాగా, ఏ పరికరం, ఎక్కడ కొనుగోలు చేయాలనేది లబ్ధిదారుల ఇష్ట ప్రకారమే జరుగుతుంది. కలెక్టర్ నియమించిన ప్రత్యేక అధికారి, ఎంపీడీఓలు యూనిట్ గ్రౌండింగ్ విషయాలను పరిశీలిస్తారు. యూనిట్ వచ్చిన నెలలోగా వెబ్‌సైట్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అంతేకాక యూనిట్‌ను రెండేళ్ల వ్యవధిలో స్పెషల్ అధికారి ప్రతీ ఆరునెలలకు ఒకసారి పరిశీలిస్తారు.

'మన ఊరు – మన బడి' పనుల పరిశీలన

చింతకాని: మండలంలోని కొదుమూరు, వందనం ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో 'మన ఊరు–మన బడి'ద్వారా చేపట్టిన పనులను నాబార్డు అధికారులు శ్రీనివాసన్, వెంకటకృష్ణ గురువారం పరిశీలించారు. కొదుమూరు ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్, డిజిటల్ బోధనకు మంజూరైన టీవీలు, తాగునీటి వసతిని పరిశీలించారు. అలాగే వందనం పాఠశాలలోనూ పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎంఈఓ మోదుగు శ్యాంసన్, హెచ్ఎం పోటు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొదుమూరు పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న అధికారులు